క్లుప్తంగా

రూ.లక్ష వితరణ



రూ.లక్ష చెక్కును అందజేస్తున్న అబ్బాయి

హిరమండలం: స్థానిక దేవరశెట్టి వీధిలో ఉన్న సత్యసాయి మందిరం పునర్ నిర్మాణానికి హిరమండలంలోని ప్రేమసాయి వృద్ధాశ్రమం అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ అంధవరపు అబ్బాయి శనివారం రూ.లక్ష చెక్‌ను మందిరం కన్వీనర్ వెంకటరమణకు అందజేశారు. ఈ సందర్భంగా అబ్బాయి మాట్లాడుతూ సత్యసాయి బాబా మందిరం పునర్ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. బాబా శత జయంతి వేడుకల నాటికి మందిరం పనులు పూర్తిచేసేందుకు కృషిచేయాలన్నారు. సత్యసయి సేవా సంస్థల జోనల్ చైర్మన్ బెహర సురేష్, అంధవరపు ధనంజరావు, ధర్మేంద్ర, బుచ్చిబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సరుబుజ్జిలి: మొక్కలు అధికంగా నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉపాధి హామీ ఏపీడీఓ పంచాది రాధ పిలుపునిచ్చారు. రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రతీ విద్యార్థి మొక్కలునాటి, వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. హెచ్‌ఎం రామకృష్ణారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు దూరంగా నూర్పిడి చేయాలి



విద్యుత్ లైన్‌పై పడిన గడ్డి

సరుబుజ్జిలి: విద్యుత్ లైన్ల కింద యంత్రాలతో వరి నూర్పిడిలు చేయడం వలన పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ట్రాన్స్‌కో ఈఈ పైడి యోగీశ్వరరావు శనివారం ప్రకటనలో వెల్లడించారు. రైతులు ధాన్యాన్ని తమ పొలంలోనే యంత్రాలతో నేరుగా నూర్పిడి చేయడం వలన వాటినుంచి వస్తున్న గడ్డి విద్యుత్ లైన్లపై పడుతుందన్నారు. మంచు కారణంగా పైనుంచి వెళ్తున్న వైర్లుకు తగిలి బ్రేక్ డౌన్లకు కారణమవుతుందన్నారు. రైతులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.

రూ.55 వేల ఆర్థికసాయం



రాజుకు ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు, కాళింగ సంక్షేమ సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: పోలాకి మండలంలోని కొల్లివలసకు చెందిన నక్క రాజు కుటుంబానికి స్థానిక ఈశ్వర్ చారిటబుల్ ట్రస్టు, కాళింగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ. 55 వేలు అందజేశారు. వారం క్రితం అగ్ని ప్రమాదం జరిగింది. ఇంట్లో ఉన్న డబ్బులు, ఇతర వస్తువులు కాలిపోయి కట్టుబట్టలతో మిగిలారు. ఈ విషయం తెలుసుకున్న ఈశ్వర్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి మార్పు విజయకుమార్, కాళింగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పూర్ణారావు స్పందించి దాతల నుంచి విరాళాలు సేకరించి ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందించారు. కాళింగ సంక్షేమ సంఘం ప్రతినిధి రోణంకి కృష్ణంనాయుడు, ట్రస్టు ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంట్రాక్ట్ లెక్చరర్ మృతి



సమీర్‌కుమార్ (ఫైల్)

పోలాకి: మండలంలోని ప్రియాగ్రహారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్(భౌతిక శాస్త్రం)గా పనిచేస్తున్న ఎస్.సమీర్‌కుమార్ (43) శనివారం గుండెపోటుతో మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమీర్ స్వగ్రామం పోలాకి మండలంలోని గొల్లలవలస. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి ఆదుకోండి

కొత్తూరు: వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్లు కలిపి ఆదుకోవాలని మండలంలోని పానుటూరు సర్పంచ్ వై.చామంతి, మల్లేశ్వరరావు, సంజీవరావు, రవితేజతోపాటు పలువురు రైతులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. బిల్ స్టాఫ్ పేరుతో వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్లు కట్ చేశారన్నారు. సాగు చేస్తున్న పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు ఎంత మొత్తం ఉన్నా చెల్లిస్తామన్నారు. కనెక్షన్లు కలపాలని ట్రాన్స్‌కో అధికారులకు పలుసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

ఉత్తమ ఫలితాలకు..

ప్రత్యేక ప్రణాళిక



ప్రత్యేక తరగతి నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

- లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రత్యేక తరగతులు
- విద్యా సామర్థ్యాల మేరకు గ్రేడ్లుగా విభజన
- చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి



విద్యార్థి ఇంటికి వెళ్ల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

- ట్రిపుల్ ఐటీకి గత మూడేళ్లుగా వరుసగా 12 మంది, 15 మంది, 18 మంది ఎంపికయ్యారు.
- 2022–2023లో 226 మంది విద్యార్థులకు 214, 2023–2024లో 243 మందికి 240 ఉత్తీర్ణులయ్యారు.
- 2024–2025లో 255 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు జిల్లా స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. గతకొన్నేళ్లుగా పదో తరగతిలో అధిక శాతం ఉత్తీర్ణత ఈ పాఠశాలకే సొంతం. ఆమదాలవలస మండలంలో, మున్సిపాలిటీలో గత ప్రభుత్వం అందించిన ఆరు ప్రతిభా పురస్కారాలు ఈ పాఠశాల విద్యార్థులే కైవశం చేసుకోవడం మరో ప్రత్యేకత. పట్టణంలో, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్యం ప్రతి ఏటా తగ్గుతుంటే.. ఈ పాఠశాలలో చేరేందుకు మాత్రం ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల సిఫార్సు కూడా కావాల్సి ఉంటుంది. ఒక స్థాయిలో అడ్మిషన్లు పూర్తయ్యాయని ఉపాధ్యాయులు చెప్పినా.. ఈ పాఠశాలలోనే అడ్మిషన్ కావాలని పలువురు పట్టుబట్టిన సందర్భాలూ ఉన్నాయి.

సన్నద్ధం ఇలా..

పాఠశాలలో 2024–25లో పదో తరగతి పరీక్షలకు 255 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిని నాలుగు గ్రేడ్‌లుగా విభజించారు. ఇ–1 గ్రేడ్‌లో 600 మార్కులకు 550 మార్కులు పైబడి తెచ్చుకునే సామర్థ్యం ఉన్నవారు, ఇ–2, ఇ–3లో కొంచెం మెరుగైనవారు, ఇ–4లో చదువులో వెనుకబడినవారిగా విభజించారు. వీరికి ప్రతీరోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు 15 మంది విద్యార్థులను దత్తతగా తీసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి చదివించేలా చూస్తున్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ప్రతీరోజు సాయంత్రం కొంతమంది విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. ఇంతవరకు మంచి ఉత్తీర్ణత శాతం సాధించామని, ఈ ఏడాది కూడా అదేబాటలో నడిపించేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు



ప్రతీరోజు ఉదయం, సాయంత్రం పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకుంటున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దీని వలన వెనుకబడిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుంది.

– కె.కావ్యశ్రీ, పదో తరగతి విద్యార్థిని, లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్

చాలా ఉపయోగం



పాఠశాలలో నిర్వహించే ప్రత్యేక తరగతులతో చాలా ఉపయోగం ఉంది. అడిగిన ప్రతీ డౌట్‌ను క్లారిఫై చేస్తున్నారు. ఇళ్లను కూడా సందర్శించి తల్లిదండ్రులతో మాట్లాతున్నారు. ప్రతిరోజూ నిర్వహించే పరీక్షల్లో వచ్చే మార్కులు, చదివే విధానంపై చర్చిస్తున్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న కృషితో మంచి మార్కులు సాధిస్తాం.

– ఎం.హర్షవర్ధన్, పదో తరగతి విద్యార్థి, లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్

ఉత్తమ ఫలితాల కోసం ప్రయత్నిస్తున్నాం..



గత కొన్నేళ్లుగా జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించే పాఠశాలగా గుర్తింపు తెచ్చుకుంటున్నాం. ప్రతిభా పరీక్షల్లో కూడా మా పాఠశాల విద్యార్థులదే పైచేయి. ట్రిపుల్ ఐటీకి ప్రతి ఏటా అధిక సంఖ్యలో ఎంపికవుతున్నారు. ప్రత్యేక ప్రణాళికతో ఉపాధ్యాయులంతా శ్రమిస్తూ మంచి ఫలితాల కోసం ప్రత్నిస్తున్నాం.

– బి.రామకృష్ణ, హెచ్‌ఎం, లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్


వితరణ



నరసన్నపేట మండలంలోని బుచ్చిపేట ప్రాథమిక పాఠశాలకు శ్రీకాకుళం ఐడీబీఐ బ్యాంక్ రూ.లక్ష విలువ కలిగిన పరికరాలు వితరణ చేసింది. విద్యార్థులు కూర్చునేందుకు 15 బెంచీలు, వాటర్ ప్యూరిఫైర్, ఐరెన్ లాకర్‌ను బ్యాంక్ అధికారులు అందజేశారు. వీటిని ఎంఈఓలు దాలినాయుడు, శాంతారావు శనివారం ప్రారంభించారు. బ్యాంకు అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– నరసన్నపేట

పట్టపగలే వెలుగులు..



నరసన్నపేట మండల పరిధిలోని గొట్టిపల్లి కూడలి నుంచి రెడ్డికిపేటకు వెళ్లే మార్గంలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. రోడ్డుకు ఆనుకొని సుమారు 20 పైగా పోల్స్ ఉండగా అన్నింటికీ లైట్లు వేశారు. ఇవన్నీ రాత్రి, పగలూ వెలుగుతుండటంతో విద్యుత్ వృథా అవుతోంది. విద్యుత్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– నరసన్నపేట

వైభవంగా తిరువీధి..



జలుమూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పుష్య మాసం శుద్ధ ఏకాదశి సందర్భంగా శనివారం రాత్రి స్వామివారికి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పార్వతీపరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

– జలుమూరు

చాలీచాలని యూరియా సరఫరా



యూరియా బస్తాలను అందజేస్తున్న వీఏఏ అలేఖ్య

సారవకోట: మండలంలోని గుమ్మపాడు రైతు సేవా కేంద్రానికి మంజూరైన 444 యూరియా బస్తాలు సరిపోకపోవడంతో రైతులు ఇబ్బందిపడ్డారు. గోపాలపురంలో వీఏఏ అలేఖ్య శనివారం రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. కొంతమందికి మాత్రమే అందించారని, మిగిలిన వారికి అందించలేదని అక్కివలస, కొత్తూరు, వండానవలస గ్రామాలకు చెందిన రైతులు ఆరోపించారు. సచివాలయం పరిధిలో సుమారు 600 ఎకరాల వరకు రైతులు రబీలో వరి సాగు చేస్తున్నారు. కొంతమంది రైతులు 10 నుంచి 20 బస్తాలు తీసుకెళ్లగా మరికొంత మందికి ఒక్క బస్తా కూడా అందక నిరాశతో వెనుదిరిగారు. తమ గ్రామానికి చెందిన రైతులకు యూరియా అందజేయాలని కోరినా ఇవ్వలేదని గుమ్మపాడు సర్పంచ్ కుమారుడు బమ్మిడి నాగరాజు అన్నారు. ప్రభుత్వం అందించిన ధర కంటే రూ.10 నుంచి రూ.20 అదనంగా వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై వీఏఏ అలేఖ్యను వివరణ కోరగా.. ముందుగా వచ్చి పాస్ పుస్తకాలు ఎవరు ఇచ్చారో వారికి కావాల్సిన యూరియా బస్తాలు అందించానని తెలిపారు. యూరియా సరఫరా అయిన మేరకు అందించానన్నారు. మిగతా వారి కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించండి

మెళియాపుట్టి: గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగు నీటి సరఫరాపై దృష్టి సారించాలని శ్రీకాకుళం జిల్లా పరిషత్ సీఈఓ ఎల్.ఎన్.వి.శ్రీధర్ రాజా అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ వేగవంతం చేయాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం వసుంధర, కొసమాల గ్రామాల్లోని మండల పరిషత్ పాఠశాలలను సందర్శించారు. ఎంపీడీఓ ఎస్.పి.పండా, మండల పరిషత్ ఏఓ రాజేశ్వరమ్మ, ఎంఈఓ దేవేంద్రరావు, ఈఓపీఆర్డీ టి.తారకేశ్వరి, ఏపీఓ టి.రవి, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన..

పాతపట్నం: పునర్ వ్యవస్థీకరణకు ప్రతిపాదనలు చేసిన పాఠశాలలను జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా పరిశీలించారు. మండలంలోని పెద్దలోగిడి ఎంపీపీ, పాతపట్నం ఎంపీపీ పాఠశాలలను తనిఖీ చేశారు. ఎంఈఓ–2 తిరుమలరావు, ఏఓ తిరుపతి పట్నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తాగునీటి సమస్య



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్.ఎన్.పేట: మండలంలోని దబ్బపాడు గ్రామంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం పర్యటించారు. మెగా రక్షిత పథకం ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరా కావటం లేదని పలువురు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. పాతపట్నం నియోజకవర్గంలో ఐదు మండలాలకు వంశధార తాగునీరు అందించేందుకు రూ.260 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈ వేసవిలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది ఉండకూడదని అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. దబ్బపాడు నుంచి సరుబుజ్జిలి మండలం తెలికిపెంట గ్రామం వరకు రెండు మండలాలను కలిపే లింకు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, ఏపీఓ వి.శ్రీదేవి, ఆర్‌అండ్‌బీ ఈఈ రవినాయక్, డీఈ విద్యాసాగర్, ఏఈ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న జడ్జి రోషిణి

పాతపట్నం: మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో విధాన్ సే సమాధాన్, మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు, జాతీయ మహిళా కమిషన్, మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో మహిళలకు న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చట్టాలు, హక్కులు, పోలీస్ స్టేషన్ ఎలా వెళ్లాలి, ర్యాగింగ్, ఉద్యోగుల ప్రదేశంలో వేధింపులు, భార్యాభర్తల చట్టాలు, పోక్సో చట్టాలను వివరించారు. తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్, ఎంపీడీఓ టి.చంద్రకుమారి, ఎస్‌ఐ బి.లావణ్య, ఏపీఎం విజయకుమారి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు శారద, రిసోర్స్ పెర్సన్ సౌజన్య, హరిప్రియ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

మెళియాపుట్టి: ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ఒడిశా ఇసుక ట్రాక్టర్లను స్థానిక పోలీసులు శనివారం పట్టుకున్నారు. పాతపట్నం నుంచి మెళియాపుట్టి ఆల్ ఆంధ్రా రహదారిలో ఒడిశాకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. రెవెన్యూ అధికారులకు అప్పగించడంతో ఒక్కో ట్రాక్టర్‌కు రూ.2 వేల అపరాధ రుసుం విధించి విడిచిపెట్టినట్లు తెలిపారు. రాత్రివేళల్లో పోలీసులు గస్తీ నిర్వహించే సమయంలో ఇసుక ట్రాకర్లు పట్టుకున్నారు. అతితక్కువ ఫైన్ విధించి విడిచిపెడుతుండటంతో దీని వెనుక కూటమి నేతల హస్తమున్నట్లు సమాచారం.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ శ్రీనివాసరావు

పాతపట్నం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. ప్రిన్సిపాల్ ప్రసాదరావు, జీవరత్నం, అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని వక్తలు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఓటు హక్కు వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, అధికారులు, విద్యార్థులు



నరసన్నపేట: ర్యాలీ చేస్తున్న నరసన్నపేట ఆర్వో లావణ్య, అధికారులు



నరసన్నపేట: ఓటు ఆంగ్ల అక్షరమాల ఆకారంలో కూర్చున్న సత్యవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు



సారవకోట: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



హిరమండలం: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఓటర్లు



పొందూరు: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, యువత



బూర్జ: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



ఎల్.ఎన్.పేట: కేజీబీవీలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



సరుబుజ్జిలి: మండల కేంద్రంలో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



కొత్తూరు: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

తల్లిదండ్రుల చెంతకు బాలిక



తల్లి స్వాతికి లాస్యను అప్పగిస్తున్న పోలీసులు

పాతపట్నం: మండలంలోని బూరగాం గ్రామానికి చెందిన 5వ తరగతి విద్యార్థిని లొడ్డి లాస్యను తల్లిదండ్రులు స్వాతి, సోమేశ్వరరావుకు అప్పగించామని ఎస్‌ఐ బి.లావణ్య శనివారం రాత్రి తెలిపారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం బూరంగాం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలకు లాస్య 8.45 వెళ్లింది. ఉదయం 9.30 గంటల సమయంలో మూత్రవిసర్జనకు వెళ్తానని టీచర్‌కు చెప్పింది. ఎప్పటికీ తిరిగి రాకపోవడంతో అదే పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న లాస్య తల్లికి ఉపాధ్యాయురాలు విషయం చెప్పడంతో గ్రామంలో వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఉపాధ్యాయులు, లాస్య తల్లి పాతపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాతపట్నం సీఐ వి.రామారావు, ఎస్‌ఐ బి.లావణ్య పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. లాస్య బస్సు ఎక్కినట్లు గుర్తించారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి వెతకడం ప్రారంభించారు. విజయనగరం బస్టాండ్‌లో ఉన్నట్లు గుర్తించారు. విజయనగరం పోలీసుల సహకారంతో పాతపట్నం తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. గంటల వ్యవధిలోనే బాలికను ఇంటికి చేర్చిన పోలీసులకు గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

అవయవదానానికి అంగీకారం

బూర్జ: మండలంలోని ఓ.వి.పేట గ్రామానికి చెందిన పేడాడ దశరథరావు (59) రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధ రాత్రి మృతి చెందారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు దశరథరావు కొంత కాలంగా బీపీతో బాధపడుతూ మందులు వాడుతున్నారు. ఈ నెల 21న మందులు వేయకుండా పొలానికి వెళ్తుతుండగా గ్రామ సమీపంలోని నాయుడు చెరువు దగ్గర కళ్లు తిరిగి పడిపోయారు. తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటే జెమ్స్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయిందని వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆర్గాన్ డొనేషన్‌కు (జీవన్‌ధాన్) ఒప్పుకున్నారు. మృతుడు కుమారుడు కోటేశ్వరరావు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

పరామర్శ..



తిరుపతిరావును పరామర్శిస్తున్న శ్రీకాంత్

పాతపట్నం: మేజర్ పంచాయతీ దువ్వారివీధికి చెందిన వైఎస్సార్‌సీపీ 3వ వార్డు మెంబర్, కార్యకర్త, విలేకరిగా పనిచేస్తున్న పెద్దింటి తిరుపతిరావుపై ఈ నెల 20వ తేదీన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి హత్యాయత్నం చేశాడు. శనివారం పాతపట్నం దువ్వారివీధిలోని తిరుపతిరావు ఇంటికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర తూర్పుకాపు కుల చైర్మన్ మామిడి శ్రీకాంత్ వెళ్లి పరామర్శించారు. తిరుపతిరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల రంజీత్, గురాడి అప్పన్న, నాగరాజు, చంద్రరావు, తిరుపతిరావు, పలువురు మీడియా ప్రతినిధులు ఉన్నారు.